283) భైరవి

ప॥ ఏటికి నెగ్గులు పట్టే విందుకు నీవు । కూటము గలగు చోట గుట్టు మేలుగదా ॥

చ॥ తెగనాడరాదు గాక తెలిసిన పనులకు । వగరాదా నిన్ను జూచి నాకు గొంతైనా ।
జగడించవద్దుగాక చనవు గలుగుచోట । సగముచూపులు చూచి సాదించరాదా ॥

చ॥ వదరగ రాదు గాక పాయరాని చోటికి । వొదిగి నివ్వెరగుతో నుండగరాదా ।
అదలించవద్దుగాక ఆనలెల్ల బెట్టుకోగ । వదలక అంతేశాల వద్దనగరాదా ॥

చ॥ గుఱిసేయరాదుగాక కూడిన కూటములకు । వెఱగునట్టి బలిమిసేయగరాదా ।
యెఱిగి శ్రీవేంకటేశ యెనసితి నిటు నన్ను । తఱి దూరగవద్దు గాక తలపించరాదా ॥